క్లుప్తంగా

నేత్రదానంపై అవగాహన

దొడ్లేరు(క్రోసూరు): అన్నిదానాల్లోకెల్లా నేత్రదానం ఎంతో గొప్పదని మండల పీహెచ్‌సీ ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్ అన్నారు. బుధవారం స్థానిక సచివాలయంలో నిర్వహించిన ఆరోగ్య సదస్సులో శ్యాంసన్ పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీవరకు 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని నేత్రదానం అనే అంశంపై అవగాహన కల్పించారు. బతికుండా ఎన్నో రకాల దానాలు చేస్తామని, చనిపోయిన తరువాత కూడా చేయగల దానం నేత్రదానం మాత్రమేనని తెలిపారు. ప్రజల్లో ఉన్న రకరకాల మూఢనమ్మకాలు, మత విశ్వాసాలు, భయాలు, అపోహాలు నేత్రదానానికి అడ్డుగా ఉన్నాయన్నారు. హెచ్ఐవీ, మెదడు వాపు, బ్లడ్ క్యాన్సర్, కంటి వ్యాధులున్నవారు నేత్రదానానికి అర్హులు కాదన్నారు. నేత్రదానం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. నేత్రదానం చేసే దాతలు గుంటూరు జీజీహెచ్‌లోని నేత్రదాన విభాగంలో సంప్రదించాలన్నారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం బి.కోటేశ్వరి, కాటం వెంకటరెడ్డి, పానెం అప్పిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఓర్చు కృష్ణయ్య, షేక్ బాజి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

నాదెండ్ల: గణపవరం గ్రామానికి చెందిన పెట్లూరి హరికృష్ణ ద్విచక్రవాహనం ఇటీవల చోరీకి గురైంది. బాధితుడు హరికృష్ణ ఇంటి ముందు నిలిపి ఉంచిన తన హీరోహోండా హెచ్ఎఫ్ డీలక్స్ వాహనం చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయటంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్ట్



వినుకొండ(నూజెండ్ల): పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి కాపర్‌వైర్‌లను దొంగిలించే ప్రకాశం జిల్లాకు చెందిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఐనవోలు పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం జరిగిన సమావేశంలో ఎస్ఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గుండ్లకమ్మ వాగు బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో నలుగురు వ్యక్తులు మూడు గోతాల్లో కాపర్ అచ్చులను, సర్వీసు వైర్ ముక్కలను తీసుకొని ఉప్పలపాడు గ్రామం వైపు నుంచి వినుకొండ వైపు వెళ్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విచారించగా ప్రకాశం జిల్లాకు చెందిన రాసిగిరి శ్రీను, నాగులూరి సుధాకర్, నాగులూరి సంసోన్, పోలా అంకాలు నలుగురు కలిసి నూజెండ్ల, బొల్లాపల్లి, వినుకొండ, సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి పరిసర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్‌వైర్‌ను దొంగిలించే వారిగా గుర్తించినట్లు తెలిపారు. వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో నవోదయ మైత్రి సొసైటీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించా రు. ఈ మేళాలో మొత్తం 300 మంది అభ్యర్థులు పాల్గొనగా 10 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న నవోదయ మైత్రి సొసైటీ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కూకట్లపల్లి ప్రసాద్, ఎంఆర్‌పీఎస్ నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథాలు ప్రారంభం



వినుకొండ టౌన్: పట్టణంలోని కొండపై వెలసిన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ పున: నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రచార ఆటోల ను కొండ ఘాట్ రోడ్డు వద్ద బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతి థిగా గౌరవ అధ్యక్షులు పెండేల పుల్లారావు హాజరై, జెండా ఊపి నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలకు ఆహ్వానం పలుకుతూ ప్రచార రథాలను పంపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పులిపాటి రామారావు, వైస్ చైర్మన్ గంధం బాలిరెడ్డి, ములకా రామతులసిరెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి నగేష్, జాజుల మాల్యాద్రి, గజవల్లి నాగపవన్, చందోలు మల్లిఖార్జునరావు, సేవకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టండి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్ష



ఏడీఏ హనుమంతరావు, ఏఓలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: కల్తీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. క్రోసూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ (డివిజన్) ఏడీఏ, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. రైతులకు స్ప్రింకర్లు, డ్రిప్ ఇరిగేషన్‌పై అవగాహన కల్పించాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ లబ్ధి పొందేలా చైతన్యవంతం చేయాలని కోరారు. రైతులకు అవసరమయ్యే తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచాలన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఇప్పటివరకు 47,005 మంది రైతులకు రూ. 261.10 కోట్ల నగదు రైతుభరోసా కింద ఉచితంగా అందించినట్లు తెలిపారు. అదేవిధంగా 43,491 మంది రైతులకు రూ.33.49 కోట్ల క్రాప్ ఇన్స్యూరెన్సు నగదు ఉచితంగా అందించామన్నారు. సున్నావడ్డీ కింద రూ.4 కోట్లు, 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.7లక్షలు చొప్పున రూ.2.17కోట్లు ఆర్థిక సహాయం అందచేసినట్లు చెప్పారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన 3,486 మంది రైతులకు 2.72 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ కింద అందించినట్లు వివరించారు. పంటల మార్పిడి విధానం పాటించేలా, ఉద్యాన పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ఏడీఏ వి.హనుమంతరావు, అచ్చంపేట ఏఓ పి.వెంకటేశ్వర్లు, అమరావతి ఏఓ షేక్ ఫకీర్ అహ్మద్, పెదకూరపాడు ఏఓ శాంతి, హార్టికల్చర్ అధికారులు శ్రీనిత్య, సీహెచ్ జనని, వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ వ్యవసాయ యూనివర్సిటీ డైరక్టర్ నెల్లూరి చంద్రబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు..

క్రోసూరు: మండలంలోని నాగవరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ కండువాలు వేసి ఎమ్మెల్యే ఘనంగా స్వాగతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో పేదలకు జరుగుతున్న మంచి చూసి అనేక మంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా అత్యధిక మెజారీతో ఎగరటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో వల్లాలశ్రీనివాసరావు, వల్లాల మద్దిరాజు, వల్లాల బాజీరావు, తదితరులున్నారు. గ్రామ నాయకులు పసుపులేటి అంకమ్మరావు, షేక్ సుభాని, సానికొమ్ము సహదేవరెడ్డి, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రికి ఎక్స్‌రే వీవర్ మిషన్ అందజేత



ఎక్స్‌రే వీవర్ మిషన్ అందిస్తున్న అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామకృష్ణ

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఎక్స్‌రే వీవర్ మిషన్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావుకు బుధవారం అందించారు. రామకృష్ణ తన మిత్రుని సహాయంతో సుమారు రూ.10వేలు విలువ చేసే రెండు మిషన్స్‌ను అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ చూడటానికి ఈ మిషన్లు ఎంతో ఉపయోగపడతాయని, ఆసుపత్రి అవసరతలు తీర్చడంలో అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ముందుంటున్నారని అభినందించారు. అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ఈ మిషన్ వల్ల ఎక్స్‌రే లో ఉన్న మార్పులను ఖచ్చితంగా నిర్ధారించవచ్చన్నారు. వ్యాధి నిర్ధారణ జరపవచ్చని, జనరల్ మెడిసిన్‌కి, ఆర్థోపెడిక్ విభాగానికి ఒక్కొక్కటీ అందజేశామని తెలిపారు. ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రవీణ్, జనరల్ మెడిసిన్ వైద్యుడు గిరిరాజు, ఆర్ఎంఓ శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యం చాటిన చిలకా కుటుంబీకులు



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న చిలకా కుటుంబీకులు

అచ్చంపేట: తమ ఇంటిపేరుగల వ్యక్తులు ముగ్గురు ఒకేసారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, రెండు తెలుగు రాష్ట్రాలలో చిలుకా ఇంటిపేరున్న వారంతా వాట్సాప్‌లో గ్రూపుగా ఏర్పడి సేకరించిన రూ.40వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. వివరాలలోకి వెళితే మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన చిలకా మరియమ్మ, ఆమె భర్త సునీల్, తమ్ముడు కిరణ్‌లు ముగ్గురూ జూలై 27న చెరుకుంపాలెం నుంచి అచ్చంపేటకు ఒకే బైకుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో మరియమ్మ, సునీల్ అక్కడిక్కడే మృతి చెందగా కిరణ్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు మరియమ్మ, సునీల్‌లు మృతిచెందడంతో ఆమె ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు. దీంతో చిలకా ఇంటిపేరుగల కుటుంబీకులు వాట్సాప్‌లో, ఫేస్‌బుక్‌లో గ్రూపులుగా ఏర్పడి పోస్టింగ్‌లు పెట్టడంతో రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న చిలకా కుటుంబీకులంతా రూ.40వేలు వసూలు చేసి పంపారు. వట్టిచెరుకూరు ఎంపీపీ చిలుకా సుబ్బారావు తన వంతుగా రూ.10వేలు పంపారు. ఈ మొత్తాన్ని వేల్పూరు గ్రామానికి చెందిన చిలుకా నాగేశ్వరరావు, చిలకా లక్ష్మయ్యల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రవిప్రసాద్, బుల్లిసత్యం, లక్ష్మయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



సత్తెనపల్లిలోని సరస్వతి శిశుమందిర్‌లో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దమ్మాలపాడులోని శ్రీకృష్ణదేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సత్తెనపల్లిలో...

పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులకు కృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాలు ఆకర్షించాయి. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉట్టికొట్టేందుకు విద్యార్థులు ఆసక్తి చూపారు.

ఆటస్థలంలో గ్రావెల్‌తో మెరక



ఉన్నత పాఠశాల ఆట స్థలంలో తోలుతున్న గ్రావెల్

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో బుధవారం గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన రహదారి కన్నా పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు మీద ఉన్న మురుగునీటితో పాటు వర్షపునీరు చేరి ఆట స్థలం చెరువులాగా మారుతుంది. వర్షం పడిన తరువాత రెండు మూడు రోజులు ఆట స్థలంలో అసెంబ్లీ నిర్వహించడానికి గానీ, విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఈ మధ్య కాలంలో ఎమ్మెల్యే ఆర్కే ఈమనిలో పర్యటించిన సందర్భంగా ఈమని పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పేరెంట్స్ కమిటీ వారు ఆటస్థలంలో తరచూ నిలుస్తున్న వర్షం నీరు, మురుగునీరు గురించి చెప్పారు. వెంటనే స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో ఈమని పాఠశాలలో గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టారు. రెండు, మూడు రోజుల్లో గ్రావెల్ ఫిల్లింగ్ పూర్తికానుందని పేరెంట్స్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తెలిపారు. పాఠశాల ఆటస్థలంలో గ్రావెల్ ఫిల్లింగ్ చేయడంపై ఎమ్మెల్యే ఆర్కేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఇండియా వలస పాలకులు పెట్టిన పేరు

పాత గుంటూరు: వలస పాలకులు దేశానికి ఇండియా అని పేరుపెట్టారు గానీ తరతరాలుగా మన దేశం భారతదేశమేనని బీజేపీ జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్ తెలిపారు. శివ శంఖారావం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కేసులో ఐటీ, ఈడీ సంస్థలు వాటి పని అవి చేస్తాయని చెప్పారు. భారత్ జోడో యాత్ర చేసిన రాహుల్ గాంధీ నేడు భారత్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

20న భక్తిగీతాల పోటీలు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని దొండపాడు గ్రామంలో శ్రీ నిదానంపాటి శివలక్ష్మి అమ్మవారి 15వ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20వ తేదీన భక్తిగీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలి పారు. ఈ పోటీల్లో సినిమా, ప్రైవేటు భక్తిపాటలు మాత్రమే పాడాలని, 12 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ అర్హులని, విజేతలైన వారికి ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9676259830 నంబరును సంప్రదించాలన్నారు.

లారీని అడ్డగించి దోపిడీ

నరసరావుపేట రూరల్: లారీని అడ్డగించి డ్రైవర్ వద్ద ఉన్న చైన్, నగదును దోచుకెళ్లిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. చిలకలూరిపేట రోడ్డు లలితాదేవి కాలనీ సమీపంలో లారీని ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు దుండగులు అడ్డగించా రు. డ్రైవర్‌ను బెదిరించి అతని వద్ద వెండిచైన్, నగదు దోచుకెళ్లారు. బాధితుడు 100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్‌ను విచారించారు. అతని ఇచ్చిన సమాచారంతో అనుమానిత యువకులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గ్రామ దేవతకు బోనాల సమర్పణ

కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామ దేవత పాతపాటేశ్వరమ్మ అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం జరిగింది. గ్రామ మహిళలు నిష్ఠతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామస్తులు గ్రామ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. గ్రామ పెద్దలు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై సమీక్ష

గురజాల: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు గురజాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి బీఎల్వీ శేషాద్రి అధ్యక్షతన ఎక్సైజ్ , పోలీస్ శాఖ, న్యాయ వాదులకు జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శేషాద్రి మాట్లాడుతూ పది లీటర్ల పరిధి వరకు లిక్కర్, బీర్లు పట్టుబడ్డ కేసులలో వాటి విలువకు మూడు నుంచి ఐదు రెట్ల వరకు చెల్లించి సదరు కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవలసినదిగా కక్షిదారులకు సూచించాలన్నారు. అలాగే ఎక్సైజ్ అధికారులు, పోలీసు వారు సదరు కేసులలో ముద్దాయిలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గాను వారికి అవగహన కలిగించి కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.షర్మిల, జానీ బాషా, ఎక్సైజ్, పోలీస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం అమ్ముతున్న యువకుడు అరెస్ట్



ఫిరంగిపురం: అక్రమంగా మద్యం అమ్ముతున్న యువకుడిని బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నుదురుపాడు గ్రామంలోని పోలేరమ్మ గుడివద్ద జి.ప్రశాంత్ కుమార్ అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్ఐ చల్లా కిషోర్ తన సిబ్బందితో వెళ్లి ప్రశాంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నరసరావుపేట కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. కోర్టు యువకుడికి 14 రోజుల రిమాండు విధించినట్లు వివరించారు.

పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి 18వ వార్డుకు చెందిన వారికి పార్టీ కండువా కప్పుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గౌరవం, సముచితస్థానం లభిస్తుందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు షేక్ ఖాసింపీరా తనయులకు పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ స్థానిక నాయకులతో కలిసి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. షేక్ ఖాశింపీరా, కుమారులు రోహిత్‌బాషా, రియాజ్‌బాషా వారి అనుచరులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పక్కాల సూరిబాబు, వార్డు నాయకులు తోట వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్‌మీరాన్, నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, స్థానికులు మెహబుల్లా, సయ్యద్ హుస్సేన్, సాయి పాల్గొన్నారు.

మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులు



గురుపూజోత్సవ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ఉపాధ్యాయుడు మంచి విద్యార్థులను తీర్చిదిద్దకపోతే భవిష్యత్తులో వారితో పాటు సమాజమంతా ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని, జాతి నిర్మాతలైన ఉపాధ్యాయులు అలసత్వం ప్రదర్శిస్తే భవిష్యత్తు చెడిపోవడానికి కారకులవుతారని పాఠ్యపుస్తక రచయిత శ్రీనివాసుల రఘురాం చెప్పారు. పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లిటౌన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం బుధవారం నిర్వహించారు. క్లబ్ ఈ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయులుగా నిర్ణయించిన ఓరుగంటి శ్రీకాంత్(గణితం), వి.వి.గోపాలకృష్ణమూర్తి(ఎస్జీటీ), లాకు పిచ్చయ్య(పీఈటీ) అబ్బూరి మంజరీదేవి, ఎం.ప్రసన్నరాణి(ప్రిన్సిపాల్) లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి వల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి తోట పద్మ, సీనియర్ లయన్స్ కంభాల వెంకటేశ్వర్లు, వై.పి.మురళీకృష్ణ, కోట వెంకటేశ్వర్లు, తోట చినసాంబశివరావు, ఇమడాబత్తుని శ్రీధర్, తవిటి భవన్నారాయణ, పెద్దింటి చంద్రయ్య, రోశయ్య, విష్ణువర్ధనరావు, వి.వి.కృష్ణమాచార్యులు, కె.గురుప్రసాద్, పెద్దింటి వెంకటేశ్వర్లు, కె.రాజశేఖర్, గ్రంథిశిల శ్రీనివాస్, డాక్టర్ నరసింహారావు తదితర సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలలో ఎమ్మెల్యే శంకరరావు ప్రత్యేక పూజలు



పవిత్రోత్సవాలలో ప్రాయశ్చిత్త హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలలో చివరిరోజు బుధవారం పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ఈఓ గోపీనాథశర్మ, అర్చకులు స్వాగతం పలికారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న కల్యాణ మండపంలో జరిగిన ప్రాయశ్చిత్త హోమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈసందర్భనలో వారి వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు



స్లో సైక్లింగ్ పోటీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నకరికల్లు: ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా క్రీడలు కూడా అవసరమని ప్రధానోపాధ్యాయురాలు షేక్ పాహిం అన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలోని ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించి బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావితరాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన వ్యక్తిత్వంతో ఎదిగితే అది ఆ ఉపాధ్యాయునికి గౌవరం తెచ్చిపెడుతుందని అన్నారు. ఉపాధ్యాయులకు వేర్వేరుగా మ్యూజికల్ చైర్స్, స్లో సైక్లింగ్, షాట్‌పుట్, వాకింగ్ తదితర క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఎస్.లలిత, చెరుకూరు వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, గేరా మోహన్‌రావు, ఏసీహెచ్ వెంకట్రావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


పాల ఉత్పత్తి ద్వారా మహిళలు ఆర్థిక ఎదుగుదల



రుణమేళాలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసమూర్తి

బొల్లాపల్లి : పాడిపరిశ్రమ అభివృద్ధికి జగనన్న పాల వెల్లువ ద్వారా మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని పశుసంవర్ధక శాఖ ఏడీ పి.శ్రీనివాసమూర్తి అన్నారు. రుణమేళా కార్యక్రమంలో భాగంగా మండలంలోని గరికపాడు, మేళ్లవాగు, కనుమలచెరువు, పలుకూరు గ్రామసచివాలయాల పరిధిలో మహిళా పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా రైతులకు పాడిద్వారా పాల ఉత్పత్తి అధికం చేసి అభివృద్ధి సాధనకు చేయూతనిస్తుందన్నారు. జీడీసీసీ బ్యాంక్ ద్వారా పాడి గేదెలు కొనుగోలుకు లక్ష రూపాయల లోపు రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. పాల ఉత్పత్తి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాల ఉత్పత్తి పెంచాలన్నారు. మహిళా పాడిరైతులు ఈ రుణాలను పొంది ఆవులు, గేదెలు కొనుగోలు చేసుకొని పాల ఉత్పత్తి ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యులు బి.సాల్మన్ సింగ్, జి. కవిత, డీఆర్‌డీఏ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

బాధతో... సంతోషంతో ..



1995-96 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురజాల: స్నేహితులంతా ఒక్కటైతే ఆ జ్ఞాపకాలకు కొదవే ఉండదు. అంతేకాదండోయ్ ఇంకా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకోవటమంటే మరీ సరదాగా సాగిపోతుంది. రోజు ఎలా గడిచిందో తెలియదు. చిన్నతనంలో చేసిన చిలిపి అల్లర్లు గుర్తు చేసుకొని ఆ జ్ఞాపకాల జీవితంలో రోజంతా గడిపితే ఆ రోజు జీవితంలో గుర్తుండిపోతుంది. అంతే కాకుండా చిన్ననాటి జ్ఞాపకానుభూతులు ఎప్పటికీ మరిచిపోకుండా ఉండేందుకు మరోసారి గుర్తు చేసుకుంటూ మరలా మరలా కలుసుకునేలా ఆ జ్ఞాపకాలు ఆ స్నేహితులను కట్టిపడేస్తాయి. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1995–96 పూర్వ విద్యార్థులు అంతా ఆత్మీయ కలయిక నిర్వహించుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకునేవారంతా వచ్చి ఉదయం టిఫిన్ చేస్తూ ఓ జ్ఞాపకం, మధ్యాహ్నం భోజనం చేస్తూ మరో అనుభూతి, ఆటలాడుకుంటూ చిన్ననాటి చిలిపి అల్లర్లను గుర్తు చేసుకుంటూ రోజు గడిపి తిరుగు ప్రయాణంలో అందరినీ విడిచిపోతున్నామనే బాధతో వీడ్కోలు పలుకుతూ మరలా కలుసుకుంటామనే ఆనందంతో ఎవరి గూటికి వారు వెళ్లిపోయారు. ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేసుకొని బై బై అంటూ ఇంటి దారి పడుతూ కన్నీటి పర్యంతమయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com